క్లుప్తంగా

నాడు- నేడు పనుల పరిశీలన

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో మన బడి నాడు-నేడు పనులను సీఆర్పీ రెడ్డి శనివారం పరిశీలించారు. అలాగే పాఠశాలలో విద్యార్థులకు రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. హెచ్ఎం సింహాచలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.25 లక్షలతో ఇంటింట కుళాయిలు



కుళాయిల పనులకు భూమి పూజచేస్తున్న ఎంపీటీసీ రామకృష్ణ

గుర్ల: మండలంలోని తాటిపూడి గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.25 లక్షలతో ఇంటింట తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీటీసీ గిడిజాల రామకృష్ణ తెలిపారు. పనులకు స్థానిక నాయకులతో కలిసి శనివారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నాయకులు ప్రభాకర్, అప్పలరాజు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై అవగాహన

గజపతినగరం: ఆపదలో చిక్కుకున్న మహిళలు సహాయం కోరిన వెంటనే అక్కడికి పోలీసులు చేరుకొని రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం దిశ యాప్‌ను ప్రవేశపెట్టిందని స్థానిక ఎస్‌ఐ గంగరాజు తెలిపారు. గజపతినగరం శ్రీకృష్ణ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు దిశ చట్టం, యాప్‌పై శనివారం అవగాహన కల్పించారు. స్మార్ట్ ఫోన్ వారంతా దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. కళాశాల సిబ్బంది శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

'గడప గడపకు' నిధులతో బోర్ల ఏర్పాటు

వేపాడ: మండలంలోని ఆతవ గ్రామంలో రూ.2లక్షలతో ఏర్పాటు చేసిన హ్యాండ్ బోర్లను సర్పంచ్ గొంప వేమనరాము, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవీ, పంచాయతీ కార్యదర్శి నానిబాబు శనివారం ప్రారంభించారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.2లక్షలతో బీసీ శ్మశానవాటికలో ఒక బోరు, పాల ఉత్పత్తిదారుల సంఘం భవనం వద్ద ఒక బోరు ఏర్పాటు చేసినట్లు ఏఈ దేవీ తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ రమేష్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ కామేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి రూ.3.80 కోట్లు

శృంగవరపుకోట: మండలంలో రెండు బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా రూ.3.80 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శనివారం తెలిపారు. ఈమేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని చెప్పారు. కొట్టాం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి బందారువానిపాలెం వరకూ బీటీరోడ్డు నిర్మాణానికి రూ.1.80 కోట్లు, ఎస్.కోట పట్టణంలో కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ నుంచి పెదఖండేపల్లి పాఠశాల వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరయ్యాయన్నారు. డిప్యూటీ ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడుకు తాను చేసిన వినతి మేరకు ఈ నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు.

వైద్యశిబిరం

గంట్యాడ: . స్థానిక కమ్యూనిటీ హాల్‌లో న్యూ స్పందన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పీజీ స్టార్, పుష్పగిరి ఆస్పత్రి సౌజన్యంతో శనివారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఎంపీపీ పీరుబండి హైమావతి ప్రారంభించారు. శిబిరానికి హాజరైన ప్రజలకు డాక్టర్లు వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీపీ దంపతులను న్యూస్పందన సంస్థ వారు సన్మానించారు. ఆ సంస్థ అధ్యక్షుడు కందుల సురేష్, సభ్యులు చిక్కాల స్వాతి, చిక్కాల చిన్నమ్మలు, రమేష్ నాయుడు పాల్గొన్నారు.

వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో తనిఖీలు



విలేజ్ క్లినిక్‌లో మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

గంట్యాడ: నరవ గ్రామంలోని వైఎస్సార్ హెల్త్ విలేజ్ క్లినిక్‌లో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు శనివారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడుతూ 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం, వైఎస్సార్ హెల్త్ విలేజ్ క్లినిక్‌లపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విలేజ్ క్లినిక్‌కు వచ్చే రోగులకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన చికిత్స అందించాలన్నారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని ఆదేశించారు. హెల్త్ ఎడ్యుకేటర్ సత్యరాజ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

సచివాలయాలు గ్రామ దేవాలయాలు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



శృంగవరపుకోట: వేములాపల్లిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



కొత్తవలస: సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కడుబండి, ఎమ్మెల్సీ రఘురాజు తదితరులు

కొత్తవలస: గ్రామ సచివాలయం ఆ గ్రామానికి గుడి లాంటి పవిత్ర ప్రదేశమని, ప్రజలకు ప్రభుత్వ సేవలు కావాలన్నా, ఏసమస్య వచ్చినా తమ గ్రామంలోనే సచివాలయానికి వెళితే పరిష్కారం లభిస్తోందని ఎస్. కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మంగళపాలెం గ్రామంలో గ్రామసచివాలయ నూతన భవనాన్ని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబుతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈసందర్భగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసేందుకు, ప్రజల ముంగిటికే ప్రభుత్వ సేవలన్నీ అందించాలనే ఉద్దేశంతో గ్రామసచివాలయ వ్యవస్థను సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి నెలకొల్పారని అన్నారు. లక్షలాది మందికి సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించారని చెప్పారు. సచివాలయాలకు సొంతభవనాలు, ఇతర సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం వేలకోట్ల రూపాయలు ఖర్చుచేసిందని తెలిపారు. మన గ్రామ సచివాలయ వ్యవస్థను దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేయాలని ఆలోచన చేస్తున్నాయని అన్నారు. తనకు తాను విజన్ ఉన్న నాయకుడిగా చెప్పుకునే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తాను అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ఈవ్యవస్థను నెలకొల్పలేకపోయారని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ నాయకులు గ్రామాల్లోకి వచ్చి కల్లబొల్లి మాటలు చెబుతారని, బూటకపు హామీలు ఇస్తారని, వారి మాయమాటలు నమ్మిమోసపోవద్దని ప్రజలకు సూచించారు. ఎమ్మెల్సీ రఘురాజు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నాయుడుబాబు మాట్లాడుతూ ప్రజలకు తలలో నాలుకలా ఉంటూ నిస్వార్థంగా సేవలందిస్తున్న గ్రామ వలంటీర్లపై ప్రతిపక్ష పార్టీలు నిందలు మోపడం మంచి పద్ధతి కాదరన్నారు. దమ్ముంటే వారు అధికారంలోకి వచ్చాక వలంటీర్ వ్యవస్థను రద్దు చేస్తామని ప్రకటించి ఎన్నికలకు వెళ్లాలని సవాల్ విసిరారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు తైనాల విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు రొంగలి జగన్నాథం, డీసీసీబీ చైర్మన్ వేచలపు చిన్నరామునాయుడు, ఎంపీపీ ఎస్.గోపెమ్మ, సర్పంచ్ ఐతంశెట్టి దుర్గ, ఎంపీటీసీ ఐతంశెట్టి నాగమణి, స్థానిక నాయకులు కోరుబిల్లి స్వామినాయుడు, అనీల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యం

శృంగవరపుకోట: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని (22ఎస్‌కెటిపి02గ్రామంలో శనివారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. మండల, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్క రించేందుకు సీఎం జగన్ ఆదేశాలతో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం పేరుతో ఇంటింటికీ వస్తున్నామని, గతంలో ఎమ్మెల్యేలు ఇలా ఇంటింటికీ వచ్చిన సందర్భాలు ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు. వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ ఫోక్ అకాడమీ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, నాయకులు డి.పార్వతి, ఎల్.రమణ, మజ్జి శేఖర్, వేమలి జగదీష, అప్పలసత్యం, మోపాడ కోటి, అల్లు మహలక్ష్మినాయుడు, సీతారాంపురం సర్పంచ్ మిడతాన చిన్నంనాయుడు, ఉల్లి శంకర్ పాల్గొన్నారు.

సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాల పంపిణీ



సోంపురంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ-2 బాలభాస్కరరావు



దత్తిరాజేరు: పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేస్తున్న డిప్యూటీ డీఈఓ బ్రహ్మజీరావు, జెడ్పీటీసీ రాజేశ్వరి

వేపాడ: మండలంలోని సోంపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలను ఎంఈఓ-2 బాలభాస్కరరావు శనివారం పంపిణీ చేశారు. అనంతరం వేపాడ కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. మధ్యాహ్న బోజనం వంటకాలను, వంట సరుకుల నిల్వలను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వసతి, విద్యాబోధనపై ఆరా తీశారు. కేజీబీవీ ఎస్ఓ కిరణ్మయికి పలు సూచనలు చేశారు. అలాగే వావిలపాడు, నీలకంఠరాజపురం పాఠశాలల్లో ఆయా పాఠశాలల హెచ్ఎంలు విద్యార్థులకు సెకెండ్ సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

విద్యారంగంలో సంస్కరణలు

గుర్ల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని పెదబంటుపల్లి సర్పంచ్ గెడ్డవు సతీష్ అన్నారు. మండలంలోని పెదబంటుపల్లి ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు, నాయకులతో కలిసి సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. హెచ్ఎం కె.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు షణ్ముఖరావు, ఉపాధ్యాయులు జి.వి.ఎస్.ఎన్.మూర్తి, కె.వి.రమణ, పి.రాంబాబు, పీడీ కుమారి, సీఆర్పీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెదమానాపురంలో...

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలను బొబ్బిలి డిప్యూటీ డీఈఓ బ్రహ్మజీరావు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి శనివారం పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనవంటలను పరిశీలించారు. రోజూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు.

బీఎల్‌ఓలకు బీఎల్‌ఏలు సహకరించాలి

- ఎమ్మెల్యే కడుబండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు

కొత్తవలస: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాపై బీఎల్‌ఓలు(బూత్‌లెవెల్ ఆఫీసర్లు) చేపడుతున్న ఇంటింట సర్వేకు వైఎస్సార్‌సీపీ బీఎల్‌ఏలు(బూత్ లెవెల్ ఏజెంట్లు) పూర్తిస్థాయిలో సహకరించి తప్పులు లేని ఓటరుజాబితా తయారికి కృషి చేయాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని అర్థన్నపాలెం గ్రామ సమీపంలోని తన క్యాంపు ఆఫీస్‌లో పార్టీ నాయకులతో కలిసి శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నుంచి నియమించిన బీఎల్‌ఏలు గ్రామాల్లో బీఎల్‌ఓలు ఓటర్ల జాబితాపై సర్వే చేసేటప్పుడు వారి వెంట ఉండాలన్నారు. మరణించిన వారి, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని, 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయించాలని చెప్పారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు తైనాల విజయ్‌కుమార్, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో ఇప్పటికే ఓటర్ల జాబితా పరిశీలన చేస్తున్నారని, వారికి పార్టీ నియమించిన ఏజెంట్లు సహకరించి దొంగ ఓట్లను గుర్తించి తొలిగించేందుకు కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, డీసీసీబి చైర్మన్ వేచలపు చిన్నరామునాయుడు, ఎల్.కోట, కొత్తవలస ఎంపీపీలు జి.శ్రీనివాసరావు,ఎస్.గోపెమ్మ, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, మండల జేసీఎస్ ఇన్‌చార్జి బొంతల వెంకటరావు, వైఎస్సార్‌సీపీ జామి,వేపాడ మండలాల అధ్యక్షులు జి.రవికుమార్,ఎం.జగన్నాథం పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

గజపతినగరం: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి మండలాల నాయకులతో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆదివారం సమావేశం కానున్నారని ఆ పార్టీ గజపతినగరం మండలం అధ్యక్షుడు బూడి వెంకటరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, పీఏసీఎస్‌ల అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఇన్‌చార్జ్ మంత్రిని కలిసిన ప్రజా ప్రతినిధులు



ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడుకు పుష్ప గుచ్ఛం అందజేస్తోన్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

విజయనగరం: జిల్లా ఇన్‌చార్జి మంత్రి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గాల సమీక్ష సమావేశాల్లో భాగంగా శనివారం జిల్లాకు వచ్చిన ఆయన విజయనగర నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆహ్వానం మేరకు ఆయన నివాశానికి వెళ్లారు. ఈ సందర్భంగా విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు కోలగట్ల నివాసానికి వెళ్లి బూడి ముత్యాలనాయుడును కలిసి సత్కరించారు. అనంతరం విజయనగరం నియోజకవర్గంలోని ముఖ్య నాయకులను ఇన్‌చార్జ్ మంత్రికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పరిచయం చేశారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా కోసమే సర్వే



రావివలసలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ అప్పారావు

చీపురుపల్లిరూరల్: తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేసేందుకే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇంటింట సర్వే నిర్వహిస్తున్నామని చీపురుపల్లి ఆర్డీఓ అప్పారావు అన్నారు. మండలంలోని రావివలస గ్రామంలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఓటర్ల జాబితాపై శనివారం నిర్వహించిన ఇంటింట సర్వేను ఆయన పర్యవేక్షించారు. బీఎల్‌ఓలకు ఆయన పలు సూచనలు చేశారు. ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే సవరించాలని, మృతిచెందిన వారు, శాశ్వతంగా వలసవెళ్లిపోయిన వారి వివరాలను తొలగించాలని చెప్పారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.సురేష్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

వేపాడ: స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మిగులు సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.ఎం.ఫ్లోరెన్స్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 5వ తరగతిలో 31 సీట్లు ఖాళీ ఉండగా ఎస్సీకి కేటాయించామని, 6వ తరగతిలో ఎస్సీ-13, 7వ తరగతిలో ఎస్సీ-19, 8వ తరగతిలో ఎస్సీ-12, ఇంటర్మీడియ్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో ఎస్సీ-6, ఎస్టీ-1, ఓసీ-1 మిగులు సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు మార్చిలో పదోతరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన విద్యార్థినులు అర్హులని తెలిపారు. విద్యార్థినులు రికార్డు సీటు, స్టడీ, ఆధార్, తల్లి, తండ్రి ఆధార్, రేషన్‌కార్డు, కులధ్రువీకరణ, ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టి ఫికెట్, తల్లి బ్యాంకు ఖాతా పాస్ పుస్తకం జెరాక్సు కాపీలతో వచ్చి పాఠశాలలో జాయిన్ కావచ్చని పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి

జామి: ఏ.ఆర్.పేటలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అర్చకులు భక్తులతో అభిషేకాలు చేయించారు. అలాగే భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

'జగనన్న సురక్ష'తో ఉచిత సేవలు



కొత్తవలస: మంగళపాలెంలో మహిళకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు,ఎమ్మెల్సీ రఘురాజు తదితరులు

'జగనన్న సురక్ష' కార్యక్రమం పేరిట ప్రజలకు ప్రభుత్వ సేవలు, అవసరమైన ధ్రువపత్రాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు తదితరులు అన్నారు. ఎస్.కోట మండలం సీతంపేట, భర్తాపురం,కొత్తవలస మండలంలోని మంగళపాలెం, లక్కవరపుకోట మండలంలోని పోతంపేట గ్రామం, గరివిడి మండలంలోని తోండ్రంగి,దేవాడ, గంట్యాడ మండలంలోని పెదమజ్జిపాలెం, గజపతినగరం మండలంలోని ఎం.గుమడాం, మెరకముడిదాం మండలంలోని సోమలింగాపురం గ్రామాల్లో 'జగనన్న సురక్ష' క్యాంపులు శనివారం నిర్వహించారు. ప్రజలకు 11 రకాల ధ్రువపత్రాలతో పాటు పలువురికి కొత్త రేషన్‌కార్డులు, రైతులకు కౌలు గుర్తింపు కార్డులను అధికారులు, ప్రజాప్రతినిధులు కలిపి అందజేశారు.

\- సాక్షి నెట్‌వర్క్



గజపతినగరం రూరల్: ఎం.గుమడాంలో ధ్రువపత్రాలు పంపిణీచేస్తున్న ఎంపీపీ జ్ఞానదీపిక



మెరకముడిదాం: సోమలింగాపురంలో ధ్రువపత్రాలను అందజేస్తున్న నాయకులు



గంట్యాడ: పెదమజ్జిపాలెంలో వృద్ధుడికి ధ్రువపత్రం అందజేస్తున్న ఎంపీపీ హైమావతి



చీపురుపల్లిరూరల్(గరివిడి): తోండ్రంగిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు,తదితరులు



లక్కవరపుకోట: పోతంపేటలో మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎంపీపీశ్రీనివాసరావు, తదితరులు

వలంటీర్ వ్యవస్థది కీలకపాత్ర



వలంటీర్లకు నియామకపత్రాలు అందజేస్తున్న ఎంపీ చంద్రశేఖర్

చీపురుపల్లి: సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో వలంటీర్ వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తోందని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నా రు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ, సచివాలయం-5 పరిధిలో నూతనంగా నియమితులైన ఇద్దరు గ్రామ వలంటీర్లకు ఆయన పట్టణంలోని తన నివాసంలో శనివారం నియామకపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వలంటీర్లు తమకు కేటాయించిన యాభై కుటుంబాల్లో అర్హులకు పథకాలు అందేలా చూడాలని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు పథకాలు, పింఛన్లు ఇంటివద్దకే అందుతున్నాయని చెప్పారు. ఎంపీ తనయుడు వంశీకృష్ణ, నాయకులు ముల్లు పైడిరాజు, మంగళగిరి శ్రీను, అప్పికొండ ఆదిబాబు, మీసాల రామారావు, ఇప్పిలి తిరుమల తదితరులు పాల్గొన్నారు.

బీమా తక్షణసహాయం అందజేత



నగదు అందజేస్తున్న అప్పలరమణ, తదితరులు

కొత్తవలస: మండలంలోని కొత్తసుంకరపాలెం గ్రామానికి చెందిన లెంక గణేష్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకం నుంచి నుంచి లక్ష రూపాయల పరిహారం మంజూరు చేసింది. బీమా తక్షణసహాయంగా మృతుడి భార్య హైమావతికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మదిన అప్పలరమణ, గ్రామపెద్దలు రూ.10వేల తక్షణ సహాయం శనివారం అందజేశారు. మిగిలిన సొమ్మును కొద్ది రోజుల్లో నామిని బ్యాంక్ ఖాతాలో జమచేస్తామని సచివాలయ సిబ్బంది తెలిపారు. నాయకుడు పి.ఎస్.ఎన్.పాత్రుడు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై నిరసన



గజపతినగరంలో నిరసన ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

గజపతినగరం: సభ్యసమాజం తలదించుకునేలా మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి డి.రాము డిమాండ్ చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మెంటాడ జంక్షన్ వరకు విద్యార్థు లతో కలిసి నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యుడు కె.జగదీష్, డీవైఎఫ్ఐ నాయకుడు రుద్రప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన బాధాకరం



వేపాడ: మణిపూర్ ఘటనను ఖండిస్తున్న దళిత నాయకులు

వేపాడ: మణిపూర్ రాష్ట్రంలో గత రెండు నెలలుగా జరుగుతున్న దమనకాండతో పాటు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనలు అత్యంత దారుణం , బాధాకరమని బహుజన కళామండలి రాష్ట్ర కార్యదర్శి ఆతవ ఉదయ్‌భాస్కర్ అన్నారు. ఆతవ గ్రామంలో దళిత నాయకులతో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీ కులాల్లో కొన్ని జాతులను కలపాలని బీజేపీ ప్రయత్నం చేసిందని, దాన్ని ఆదివాసీలు వ్యతిరేకించారనే నెపంతో చర్చిలు కూల్చివేయడం, దాడులు చేయడంలాంటి పనులు హేయమన్నారు. దళిత నాయకులు కర్రి దేముడు, ఆతవ నాగరాజు, డప్పురాజు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగించుకోండి




భూపాలపురంలో అవగాహన కల్పిస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు

గుర్ల: 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ బెల్లాన బంగారునాయుడు వలంటీర్లు,గృహసారథులను కోరారు. మండలంలోని భూపాలపురం, నడుపూరు గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు,గృహ సారథులకు 'జగనన్న సురక్ష' కార్యక్రమంపై శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఎవరికి ఏ ధ్రువపత్రం కావాలో తెలుసుకుని ప్రత్యేకయాప్‌లో నమోదు చేసి, వాటి మంజూరుకు కృషి చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనమిత్ర దరఖాస్తుల పరిశీలన

వేపాడ: వాహన మిత్ర పథకం కోసం ఆటో డ్రైవర్లు చేసుకున్న దరఖాస్తులను వారి వివరాలను ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె.పట్నాయక్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామాల్లో పర్యటించి దరఖాస్తుదారుల ఆటోలను, వారి వాహనాల పత్రాలను తనిఖీ చేశారు. దరఖాస్తుల్లో ఏమైనా లోపాలు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి



గరుడుబిల్లిలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

వేపాడ/ బొండపల్లి/ జామి: జగనన్న లేఅవుట్లతో పాటు సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ, ప్రత్యేక అధికారులు లబ్ధిదారులను కోరారు. హౌసింగ్ డేలో భాగంగా వేపాడ మండలంలో జగ్గయ్యపేట గ్రామంలో గృహనిర్మాణాలను హౌసింగ్ ఏఈ అప్పలనాయుడు, వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. బొండపల్లి మండలంలోని గరుడుబిల్లి జగనన్న లేఅవుట్‌లో నిర్మాణాలను హౌసింగ్ ఏఈఈ బి.వి.రమణమూర్తిరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ సంతోష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు బొద్దల చిన్నంనాయుడు, సర్పంచ్ కృష్ణవేణి ,ఎంపిటీసీ పాలూరి జోగమ్మ, జామి జగనన్న లేఅవుట్‌లో నిర్మాణాలను జామి మండల ప్రత్యేక అధికారి రామ్‌గోపాల్, ఎంపీడీఓ సతీష్,హౌసింగ్ ఏఈ వెంకటరావు పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లిస్తోందని అధికారులు చెప్పారు.అవసరమైన వారికి వెలుగు ద్వారా రుణం అందిస్తున్నామని తెలిపారు.